క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

వేముల : మండలంలోని వేముల విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు జాబ్‌మేళా

కమలాపురం : కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. అభి గ్రీన్ టెక్నాలజీస్, అల్ డిక్సన్, యంగ్ ఇండియా కంపెనీలలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, డిప్లొమా అగ్రికల్చర్, డిగ్రీ, పీజీ చదివిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు 19–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎంపికై న వారికిరూ. 10–25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

వేములలో

వేముల ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియా, యంగ్ ఇండియా, అమర్‌రాజా గ్రూప్ కంపెనీలలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివిన వారు 18–45 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ. 11,875 వేతనం ఉంటుందన్నారు.

పవర్ జనరేషన్‌పై శిక్షణ

సింహాద్రిపురం : మండలంలోని నిడివెల్ల గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు గురువారం ఒకేషనల్ కోర్సులో భాగంగా పారిశ్రామిక క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యార్థులకు పవర్ జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్‌పై జేఈ దినేష్‌కుమార్ క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఓ గురుదేవి మాట్లాడుతూ ప్రత్యక్ష బోధన ద్వారా ఉత్తమ విద్యనభ్యసించవచ్చునన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు రామతులసి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కనెక్షన్లు తొలగించండి



అధికారులతో చర్చిస్తున్న జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ

ఎర్రగుంట్ల : విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్‌లు తొలగించాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. గురువారం ఎర్రగుంట్ల, కమలాపురం విద్యుత్ కార్యాలయాలలోని విద్యుత్ బిల్లుల వసూళ్లపై ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమై బిల్లులుపై చర్చించారు. సంస్థ నెల రోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసి మరొక నెల రోజులు గడువిచ్చి బిల్లు కట్టమంటుందన్నారు. అంటే వినియోగదారులకు రెండు నెలలు గడువు ఇస్తుందన్నారు. విద్యుత్ బకాయిలు వసూళ్లలో రాజీ వద్దు దయ చూపించే స్థితిలో లేమన్నారు. బకాయిలు వసుళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మొండి బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేసి నిబంధన ప్రకారం వారి మీటర్ శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్ బకాయిలు వసూళ్లు చేయాలని సూచించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

వేముల : గొందిపల్లె పంచాయతీ పరిధిలోని చిన్నగొందిపల్లెలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్టకు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మాజీ పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు విగ్రహ ప్రతిష్టలో పాల్గొని పూజలు నిర్వహించారు.

లింగ వివక్షకు, హింసకు అడ్డుకట్ట వేయాలి

ముద్దనూరు : లింగ వివక్షకు, లింగ ఆధారిత హింసకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ స్థానిక అధికారులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి మాట్లాడుతూ లింగ వివక్ష, జెండర్ ఆధారిత హింస, కిషోర బాలికల సంరక్షణ, బాల్య వివాహాలను అరికట్టడం వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని, ఇవి చట్టరీత్యానేరమని ఆయన తెలిపారు. ముద్దనూరులో ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల జెండర్ ఆధారిత హింసపై ప్రచారం, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో ముంతాజ్‌బేగం, ఏపీఎం అపర్ణ, వెలుగు సీసీ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదైతేనే ఉచిత గ్యాస్

పులివెందుల రూరల్ : ఉచిత సిలిండర్ పథకానికి ఈకేవైసీ తప్పనిసరి అని ప్రభుత్వం చెప్పడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం నుంచి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు పొందాలంటే తమ గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఆధార్‌తో లింక్ చేయించుకోవాలని ప్రభుత్వం అధికారులు చెబుతున్నారు. సరైన అవగాహనలేక చాలామంది లబ్ధిదారులు పథకానికి దూరంగా ఉన్నారు. సిలిండర్ డెలివరీ చేసే బాయ్‌లు సిలిండర్ వచ్చే సమయంలో తప్పనిసరిగా లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పినా పట్టించుకోని పరిస్థితి. ప్రభుత్వం దీపావళి సందర్భంగా గతనెల ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. పులివెందుల డివిజన్ వ్యాప్తంగా 48,229 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో దీపం పథకం కింద 33,129, ఉజ్వల్ పథకం కింద 15,060లు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 26,350 మంది లబ్ధిదారులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారు. 21,879 మంది ఇంకా చేయించుకోలేదు. అయితే ప్రభుత్వం ఉచిత సిలిండర్లు ప్రకటించడంతో మరో ఐదు వేల మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారు. ఉచిత సిలిండర్లు



ఈకేవైసీ చేయించుకునేందుకు వేచి ఉన్న గ్యాస్ వినియోగదారులు (ఫైల్)

గ్యాస్ కనెక్షన్లు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ లింక్ చేయించుకోవాల్సి ఉంది. గతంలో రేషన్ కార్డు ఉండి.. వివిధ కారణాలతో తొలగించిన వారికి కూడా ఈకేవైసీ నమోదు కాలేదు. కొంతమంది గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకున్న ఎర్రర్ చూపిస్తున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేలాది మంది ఉచిత సిలిండర్లు పొందలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా మండలాలలో ఇంటి వద్దకే వెళ్లి ఈకేవైసీ చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇప్పటికే తహసీల్దార్ మహ్మద్‌నజీర్ గ్యాస్ ఏజెన్సీ వారికి ఉచిత గ్యాస్ సిలిండర్లపై అవగాహన కల్పించారు. అర్హులైన వారందరికీ ఉచిత సిలిండర్ల అందేలా చర్యలు తీసుకోవాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. బుక్ చేసిన 48 గంటల్లో లబ్ధిదారుల అకౌంట్‌లో ప్రభుత్వం డబ్బులు వేస్తోందన్నారు.

గ్యాస్ వినియోగదారులకు తప్పని కష్టాలు :

ప్రభుత్వం ఏడాదికి ఉచిత మూడు సిలిండర్ల అందిస్తామని ఎన్నికల సమయంలో చెప్పింది. కానీ



ప్రభుత్వం చెప్పిన విధంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితగా ఇవ్వడం, దానికి ఈకేవైసీ లింకు పెట్టడంతో చాలామంది గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీ వారి దగ్గరికి వెళ్తే అక్కడ సర్వర్లు పనిచేయక గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు.

గ్యాస్ పైపు తీసుకుంటేనే ఆన్‌లైన్‌లోకి ఎక్కిస్తారు :

గ్యాస్ ఉచిత పథకానికి సంబంధించి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల దగ్గరికి వెళ్లి ఈకేవైసీ చేయించాలని అడిగితే ఏజెన్సీ నిర్వాహకులు వారి వ్యాపారం కోసం వారి దగ్గర ఉన్న గ్యాస్ పైప్ తీసుకుంటేనే ఈకేవైసీ అయిపోతుందని, తర్వాత మీ అకౌంట్‌లో ప్రభుత్వం అందించే డబ్బులు పడతాయని చెబుతున్నారు. దీంతో చేసేది ఏమీ లేక చాలామంది తప్పనిసరి పరిస్థితుల్లో వారు ఇచ్చే గ్యాస్ పైపు తీసుకుని వెళ్తున్నారు.

బీరువాల వితరణ

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న కస్తూర్బా పాఠశాలకు జమ్మలమడుగు పట్టణానికి చెందిన లైసెన్స్ సర్వేయర్ గొందిపల్లి సంజీవరాయుడు రూ.30,000 విలువ చేసే రెండు బీరువాలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఎంఈవో చౌడయ్య అభినందించారు. పాఠశాల ఎస్‌వో మౌనిక, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చర్యలు చేపడుతున్న సిబ్బంది

పులివెందుల టౌన్ : పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో గురువారం సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడుతూ ప్రతిరోజు ఒక సచివాయల పరిధిలోని వార్డులలో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

పులివెందుల టౌన్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో అన్ని డిజిటల్ సేవలు సౌకర్యం కలదన్నారు. రూపే కార్డ్ సదుపాయం ఉందని, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ఉన్నాయన్నారు. ఏ బ్యాంకు ఖాతాదారుడైన మా బ్యాంకు వ్యాపార ప్రతినిధి వద్ద ఆధార్ కార్డుతో ఆర్థిక లావాదేవీలు జరుపుకునే అవకాశం కూడా ఉందన్నారు. టర్మ్ డిపాజిట్లపై తమ బ్యాంకు అధిక వడ్డీ అందిస్తుందన్నారు. అగ్రికల్చర్ లోన్స్, డైరీ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్, కార్ లోన్, హౌసింగ్ లోన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మేడా వెంకట గణేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

కమలాపురం : పట్టణ పరిధిలోని పడమట వీధిలో వెలసిన పురాతన పాతాళ సోమేశ్వరాలయంలో శివ పార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు, శివ మాల స్వాములు, భక్తుల ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పుర వీధుల గుండా ఊరేగించారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.



కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

పెండింగ్ పనులు పూర్తి చేయించండి

పులివెందుల టౌన్ : నిధులు విడుదల చేయించి పులివెందులలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కోరారు. గురువారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ రాముడు అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి ముందుగా కౌన్సిల్ అజెండా చదివి వినిపించారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పులివెందులలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. కనీసం వీధిలైట్లు, 80 శాతం పనులు పూర్తయిన వాటికి కూడా నిధులు మంజూరు కాకపోవడం దౌర్భాగ్యమన్నారు. పులివెందులలో 80 శాతం వీధి లైట్లు కాలిపోతే వాటిని ఏర్పాటు చేసేందుకు నిధులు లేకపోవడంతోపాటు మున్సిపాలిటీలో నెల కొన్న సమస్యలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. అందుకు స్పందించిన ఎంపీ రూ.5 లక్షలను అందించి పనుల ప్రాధాన్యతను బట్టి సొంత నిధులను ఉపయోగించాలన్నారు. వీధిలైట్లకు సంబంధించి ఈఈఎస్‌ఎల్ కంపెనీ ద్వారా 2017లో అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందని, 3,600 వీధిలైట్ల నిర్వహణ చేయాల్సి ఉండగా.. అందుకు వారు ఏమాత్రం స్పందించకపోవడంతో వారికి రూ.45 లక్షలు జరిమానా విధించడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలాంటి పనులు చేయకపోయినా ఈఈఎస్‌ఎల్ కంపెనీకి డబ్బులు చెల్లించాలనడం సరికాదని.. ఒక్క రూపాయి కూడా చెల్లించమన్నారు. ఎస్‌టీపీ పనులకు సంబంధించి రూ.25 కోట్లు అవసరం ఉందన్నారు. అంతేకాకుండా పెండింగ్‌లో ఉన్న స్మశాన వాటికలు, యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్సీని కోరారు. దీనికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ముందుకు పోదామన్నారు. అందుకు కావాల్సిన సాధారణ నిధులను ప్రభుత్వం ద్వారా విడుదల చేయించేందుకు కృషి చేస్తానన్నారు. పులివెందులలో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని.. నిధులు మంజూరు చేయిస్తామని భరోసా ఇస్తే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు వస్తారన్నారు. మున్సిపాలిటీలో ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత మేరకు నిధులు అవసరమవుతాయన్న వివరాలపై ఎస్టిమేట్ చేసి ఇవ్వాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ఈ సందర్భంగా కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ మాట్లాడుతూ వీధిలైట్ల నిర్వహణ కష్టంగా మారిందని.. వీధిలైట్లు సరిగా వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పులివెందుల మున్సిపాలిటీలో ఆవులు, పందులు సంచరించకుండా ప్రత్యేక చొరవ తీసుకుని గోశాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయండి

కమలాపురం : వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్ల మండలాల్లోని పొలాల్లో రైతులు సాగు చేసిన పంటలకు తప్పని సరిగా ఇ–క్రాప్ బుకింగ్ చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వీఏఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్ పరిధిలో 2024 రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంటలకు తప్పని సరిగా ఇ–క్రాప్ బుకింగ్ నమోదు చేయాలన్నారు. రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధరలకు పంటలు విక్రయం తదితర పథకాలు అందాలంటే తప్పని సరిగా ఇ–క్రాప్ బుకింగ్‌తో పాటు ఇ-కేవైసీ చేయాలని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు పీఎంఎఫ్‌బీవై పథకం కింద వివిధ రకాల పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం రైతు వాటా చెల్లించాలన్నారు. రైతులు ఇన్సూరెన్స్ చెల్లించే పంటలకు కచ్చితంగా ఇ–క్రాప్ బుకింగ్ చేసి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ కట్టుకున్న విస్తీర్ణానికి, ఇ–క్రాప్ బుకింగ్ విస్తీర్ణానికి తేడా ఉంటే కంప్యూటర్ రిజెక్ట్ చేస్తుందన్నారు. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకుల్లోనే ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ప్రీమియం చెల్లించాలన్నారు. దిగుబడి ఆధారిత పంటలకు మన జిల్లాకు ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కంపెనీని ఎంపిక చేశారన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

అలాగే వాతావరణ ఆధారిత పంటలకు ఇఫ్కో కంపెనీ వారికి ప్రీమియం చెల్లించుటకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. శనగ పంట గ్రామ యూనిట్ కింద పరిగణిస్తారని, వేరుశనగ, జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వు, వరి, మినుము, మొక్క జొన్న పంటలకు మండల యూనిట్ కింద పరిగణిస్తారన్నారు. ఉల్లి, పెసర పంటలను జిల్లా యూనిట్ కింద పరిగణిస్తారన్నారు. రైతుల్లో రుణాలు పొందిన రైతులు తప్పని సరిగా పంటలకు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే నాన్‌లోని రైతులు రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని కలసి పంట ధృవీకరణ పత్రాన్ని తీసుకుని కామన్ సర్వీస్ సెంటర్‌లో పంటల బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఇ–క్రాప్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామచంద్రుడు మాట్లాడుతూ ఇ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఏఓ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటలకు ఇ–క్రాప్ నమోదు చేసుకుంటేనే ఆ పంటలకు సంబంధించిన పంటల బీమా, పెట్టుబడి రాయితీలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సర్వేయర్లు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటకు ఇ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి రమేష్ రైతులకు సూచించారు. బుధవారం నుంచి పంట నమోదు చేయడానికి వీలుగా అందరు రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఇ-పంట అప్లికేషన్ అందుబాటులోకి వచ్చిందన్నార. ఇప్పట్ల గ్రామంలో జరుగుతున్న ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎటువంటి అవకతవకలు లేకుండా ఖచ్చితంగా పంట నమోదు చేయాలని మండల, జిల్లా, డివిజనల్, రాష్ట్రస్థాయి అధికారులు నమోదు ప్రక్రియను తనిఖీ చేస్తారని, ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటారన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 4500 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలంలో గురువారం భారత సమాజ విప్లవకారుడు జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అలాగే రాష్ట్రంలో వేధింపుల పర్వం, అలవి కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేక, ఎంతసేపూ గత ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం తప్ప ఏ పనిచేయని చంద్రబాబు, ఇన్నాళ్లు చేస్తోంది కేవలం శాడిస్ట్ పాలన, కక్ష సాధింపు చర్యలు మాత్రమేనన్నారు. ఉద్యోగాలులేవు, నిరుద్యోగ భృతి రూ. 3వేలు అంతకంటే లేదు, ఆ ఆలోచనే లేదని అసెంబ్లీ సాక్షిగా తేల్చాశారన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నూర్‌బాష సంఘ రాష్ట్ర నాయకులు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కో ఆప్షన్ చంద్రమౌళి, వాల్మీకి సంఘ నాయకులు, బలిజ సంఘం నాయకులు సోపాల వీరా, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

చాక్రయపేటలో..

చక్రాయపేట : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గండి గురుకుల పాఠశాలలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించినట్లు జన విజ్ఞానవేదిక సీనియర్ నాయకుడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత పొన్నతోట గంగాధరరెడ్డి తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మెజీషియన్ బాలబయన్న మ్యాజిక్ షోతో విద్యార్థులను అలరించారు.



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

ముద్దనూరులో..

ముద్దనూరు : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఇతర కార్యకర్తతో కలసి పూలేకు ఘనంగా నివాళులర్పించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పూలే విగ్రహానికి రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళిలు నివాళులు అర్పించారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీలేదు

జమ్మలమడుగు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టకుండా ప్రశ్నించే వారిపై కేసులు పెడుతోందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. నియోజకవర్గంలో ఇద్దరు నాయకుల స్వార్థప్రయోజనాలకు శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పోలీసులు మాత్రం నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సంపదలను సృష్టిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు అప్పులు సృష్టిస్తున్నాడన్నారు. విద్యార్థులకు ఇవ్వవలసిన స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో చదువులకు స్వస్తి చెప్పే పరిస్థితి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం తగ్గిపోయిందన్నారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, రమణారెడ్డి, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, మార్బల్ శ్రీను, యోబు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

పన్నులను చెల్లించి రసీదులు పొందండి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటి, నీటి పన్నులు వార్డు సచివాలయంలో కానీ, మొబైల్ కలెక్షన్ కౌంటర్ వ్యానులో కానీ, ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రసీదులు పొందాలని మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది వీరమోహన్ పన్ను డబ్బులు తీసుకుని రసీదులు ఇవ్వలేదని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. వీరమోహన్‌ను ఏడు నెలల క్రితమే విధుల నుండి తొలగించం జరిగిందని.. అతనికి ఇంటి, నీటి పన్నుల డబ్బులను ఇవ్వొద్దన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు.

సోలార్ వినియోగం వల్ల విద్యుత్ బిల్లులు ఆదా

జమ్మలమడుగు రూరల్ : సోలార్ వినియోగం వల్ల విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని విద్యుత్ శాఖ జిల్లా ఎస్‌ఈ రమణ తెలిపారు. గురువారం పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో సోలార్ వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. రాయితీతో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ వినియోగించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఒక కిలో వాట్ సామర్థ్యంకు రూ.30 వేల రూపాయలు రెండు కిలో వాట్స్ సామర్థ్యంకు రూ.60 వేలు, అలాగే మూడు కిలో వాట్స్‌కు రూ.78 వేలు చొప్పున రాయితీ లభిస్తుందని ఆయన తెలిపారు. అంతే కాకుండా రాయితీ పోను తక్కువ వడ్డీతో బ్యాంక్‌లు రుణాలు ఇస్తాయన్నారు. నెలకు విద్యుత్ బిల్లు రూ.1000 వస్తే సోలార్ ద్వారా రూ.338కి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ రాజగోపాల్, అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఈ

సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ పరిశీలన



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

పులివెందుల రూరల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గురువారం సందర్శించి మాట్లాడారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సమితి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చునన్నారు. పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, ఖైదీలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ చేయడం మనందరి బాధ్యత



దివ్యాంగ విద్యార్థులకు టీవీని బహుకరిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి

వేంపల్లె : దివ్యాంగులకు సేవ చేయడం మనందరి బాధ్యత అని ఉషాకిరణ్ స్కూల్ కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి తెలిపారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక భవిత సెంటర్ దివ్యాంగ చిన్నారుల ఉపయోగార్థమై స్మార్ట్ టీవీని ఆయన బహుకరించారు. మన జీవిత ప్రయాణం సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని అందుకు అనుగుణంగా శ్రమించి జీవితంలో ఉన్నత స్థానాన్ని సాధించాలన్నారు. దివ్యాంగ చిన్నారులకు విశిష్ట సేవలందిస్తున్న భవిత సెంటర్ సిబ్బంది ఐఈఆర్టీ యశోద, కేర్ టేకర్ సుజాత, ఆయాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

పులివెందుల రూరల్ : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. గురువారం పులివెందుల అర్బన్ పరిధిలోని నగరిగుట్టలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలని, ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



లార్వాలను గుర్తిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఉపాధి పనుల తనిఖీ

చింతకొమ్మదిన్నె : పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో కులాయి బాబు, ఉపాధి ఏపీవో రామానుజులరెడ్డి తనిఖీ చేశారు. వెంకటలక్ష్మి పొలంలో జరుగుతున్న ఫారంపాండ్ పనిని వారు పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. పనులు నాణ్యతతో చేయాలని, కూలి రూ.300 వచ్చేటట్లు చేయాలని సూచించారు. అలాగే ఇదే పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో కంది మహేశ్వరి నిర్మిస్తున్న పశువుల షెడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. ఉపాధి ఈసీ అన్నానాయక్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

ధర్నాను జయప్రదం చేయాలి

సింహాద్రిపురం : అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలందరికీ రెండు ఎకరాల సాగు భూమి, మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని డిసెంబర్ 2న పులివెందుల ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య కడప జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. బడుగు, బలహీనవర్గాలపైన రాజకీయ, ఆర్థిక, సామాజిక వివక్ష చూపిస్తున్న పాలక ప్రభుత్వాలకు బుద్ధి రావాలంటే పోరాటమే శరణ్యమని భూమిలేని నిరుపేదలు ధర్నాకు తరలి రావాలన్నారు.